మినీ కథ

# దాంపత్య రహస్యం

గ్రామ పంచాయతీ జరుగుతోంది. సీతాలును రామునాయుడు గొడ్డును బాదినట్టు బాది పుట్టింటికి తోలేశాడు. సీతాలు గ్రామ పెద్దల కాళ్ళావేళ్ళా బడింది. మొగుడి మీద పంచాయితీలో పెట్టించింది.

"నీ మొగుడు రామునాయుడేనా?" అడిగాడు గ్రామాధ్యక్షుడు.

సీతాలు రుసరుసలాడి తలూపింది.

"అతడు నిన్ను ఏం చేశాడో చెప్పవమ్మా!"

"జుత్తు పట్టుకుని ఈడ్చి ఫెడీఫెడీమని బాదేశాడు."

"ముందు బాది బాది జుత్తు పట్టుకున్నాడా? జుత్తు పట్టుకుని బాదాడా?"

"ముందే జుత్తు పట్టుకున్నాడండి."

"నువ్వేమన్నావు?"

"సచ్చినోడా అన్నాను."

"ఎందుకన్నావు?"

"అనాలనిపించింది."

"అంతకుముందు అతడు నిన్నేమయినా అన్నాడా?"

"సీతీ! సీతీ! అన్నాడు. నాకు అలా పిలిపించుకోవడం అంటే ఒళ్ళుమంట."

"అంతకుముందు నువ్వు అతడిని ఏమయినా అన్నావా?"

"గొడ్డును బాదినట్టు బాదాడు. ఆ సందట్లో మర్చిపోయాను."

అధ్యక్షుడు చిలక నవ్వు నవ్వాడు.

"చూడు, తల్లీ! అంత మతిమరుపు ఉండకూడదు. ఉదాహరణకు నన్నే చూడు. మూడు నెల అయింది. మా ఆవిడకు వజ్రాల హారం తీసుకు వచ్చాను. కొడుకు పెళ్ళికి వేసుకుంటానని గోల పెడితే తెచ్చాను. ఈ మూడు నెలల్లో ఎన్నోసార్లు ఆమెకు ఈ సంగతి చెప్పి ఆమె మొహంలో వెలుగు చూడాలని ఆశపడ్డాను. ఎన్నోసార్లు నోటిదాకా వచ్చినా చెప్పలేదు. నా బట్టల పెట్టెలో బట్టల అడుగున దాన్ని గుడ్డ చుట్టి ఉంచాను. ఎందుకు దాచానంటావు? ఆమె ఈ రోజే అలంకరించుకుని పుట్టింటి వాళ్ళకు చూపించాలని వెళ్తుందేమోనని నా బెంగ."

ఆలుమగళ్ళ మధ్య అనురాగం పెంచాలని అధ్యక్షుల వారు తమ దాంపత్యం ఉదాహరణ చెప్పారు.

అతడి ప్రయత్నం ఫలించింది. సీతాలూ, భర్త మొహ మొహాలు చూసుకొన్నారు. మళ్ళీ మాట్లాడకుండా జంటగా ఇంటికెళ్ళిపోయారు.

అధ్యక్షుడు చిద్విలాసంగా మేఘాల మీద గెంతుకుంటూ ఇంటికి వెళ్ళాడు.

భార్య వంటింట్లో ఇంకా సర్దుకుంటోంది. ఇంక చెప్పకుండా దాచలేకపోయాడు.

"నీకు వజ్రాల నెక్లెసు తెచ్చానోయ్, ఇల్లాలా!" అన్నాడు అధ్యక్షుడు.

"అవునండి. చాల బాగుంది" అంది ఆమె మొహంలో మెరుపులు నింపి.

"ఏమిటి? అప్పుడే చూసేశావా?"

"ఆఁ! పేరు చెక్కించలేదని పంపించారు కదా! అప్పుడు చూశాను."

"ఏమిటి పంపించడం?"

"బత్తుడిని పంపారు కదా!"

"నేను పంపలేదు."

"మీ బట్టల అడుగులో గుడ్డ చుట్టి ఉంచినట్టు చెప్పి పంపారు కదా!"

అధ్యక్షుడు నెత్తిన చెయ్యి పెట్టుకుని కుప్ప కూలబడిపోయాడు.




- ఎమ్. వి. వి. సత్యనారాయణ